https://epaper.manasamajam.com Contact No. 9989788438, 9505285656

# మన సమాజం

తెలుగు డిజిటల్ దిన పత్రిక

Truth towards the Society

చైర్మన్ : పార్వతి సురేష్ కుమార్ ఎడిటర్ : పార్వతి రాజేష్ కుమార్

సంపుటి : 01 సంచిక : 360 శనివారం 11-4-2026 పేజీలు : 4

రిపోర్టర్స్ కావలెను

మన సమాజం
Truth towards the Society

మన సమాజం తెలుగు డిజిటల్ దినపత్రికలో
నిఖార్సైన జర్నలిస్టుగా నిలబడాలనుకుంటున్నారా?
అన్ని తరహా వార్తలు, కథనాలు ఎలాంటి ఆంక్షలు లేకుండా
రాయాలని కోరుకుంటున్నారా?
తెలంగాణ వ్యాప్తంగా అన్ని జిల్లాలు, మండలాలల్లో
పనిచేసేందుకు విలేఖరులు కావలెను...
మీ కలాలకు పదును పెట్టండి.
సంప్రదించవలసిన నెంబర్లు
9989788438, 9505485656.

# హడావుడి ఏల?

## 5 రాష్ట్రాల ఎన్నికల్లో లబ్ధికే మహిళా రిజర్వేషన్, పునర్విభజన బిల్లులు

**పోలింగ్ తర్వాతే పార్లమెంటు సమావేశాలను పెట్టాలని లేఖ రాసినా పట్టించుకోలేదు**

**లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచితే దక్షిణాదికి నష్టమేనని పునరుద్ఘాటించిన రేవంత్ రెడ్డి**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10**
ఐదు రాష్ట్రాల ఎన్నికల్లో ప్రయోజనాల కోసమే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు పెట్టి మహిళా రిజర్వేషన్ బిల్లు, నియోజకవర్గాల పునర్విభజన బిల్లును పెడుతున్నారని కాంగ్రెస్ పార్టీ ఆరోపించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు పేరిట నరేంద్ర మోదీ ప్రభుత్వం రాజకీయాలు చేస్తోందని మండిపడింది. నియోజకవర్గాల పునర్విభజన బిల్లును మహిళా రిజర్వేషన్ బిల్లుతో లింకు పెట్టడం రాజ్యాంగబద్ధం కాదని స్పష్టం చేసింది. అసెంబ్లీ ఎన్నికల తర్వాత పూర్తిస్థాయిలో చర్చించిన తర్వాతే ఈ రెండు బిల్లులను ప్రవేశపెట్టాలని, లేకపోతే 'తీవ్ర పరిణామాలు' తప్పవని హెచ్చరించింది. ఎన్నికల తర్వాతే పార్లమెంటు సమావేశాలు నిర్వహించాలని, అది కూడా అఖిలపక్ష సమావేశంలో చర్చించిన తర్వాతే ఓ నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. జన గణన తర్వాతే నియోజకవర్గాల పునర్విభజన చేయాలని గతంలో తీసుకున్న నిర్ణయానికి కట్టుబడి ఉండాలని తేల్చి చెప్పింది. పార్టీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే అధ్యక్షతన 3 గంటలకుపైగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ (సీడబ్ల్యూసీ) శుక్రవారం ఢిల్లీలో సమావేశమైంది. పార్టీ అగ్ర నేతలు రాహుల్ గాంధీ, ప్రియాంక గాంధీ, కేసీ వేణుగోపాల్, జైరాం రమేశ్, సచిన్ పైలట్, శశిథరూర్, మీరాకుమార్, అంబికా సోనీ, ఆనంద్ శర్మ, కర్ణాటక, తెలంగాణ ముఖ్యమంత్రులు సిద్దరామయ్య, రేవంత్ రెడ్డి, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్‌జిత్ సింగ్ చన్నీ తదితరులు సమావేశంలో పాల్గొన్నారు. మహిళా రిజర్వేషన్, నియోజకవర్గాల పునర్విభజన బిల్లులను ఆమోదించేందుకు ఈనెల 16, 17, 18 తేదీల్లో పార్లమెంట్ ప్రత్యేక సమావేశాలు ఏర్పాటు చేయాలని కేంద్రం ఏకపక్షంగా నిర్ణయం తీసుకోవడంపై సమావేశంలో తీవ్ర నిరసన వ్యక్తమైంది. అన్ని రాజకీయ పార్టీల అగ్ర నాయకులతో మల్లికార్జున్ ఖర్గే ఈనెల 15న సమావేశమవుతారని, పార్లమెంటులోని సభా నాయకులతో సమావేశమై వ్యూహ రచన చేస్తారని సమావేశం నిర్ణయించింది. పార్లమెంటులో ఆ రెండు బిల్లులను వ్యతిరేకించాలా లేదా అనే అంశంపై తుది నిర్ణయం తీసుకోవాలని తీర్మానించింది. ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికల్లో రాజకీయ ప్రయోజనం పొందడానికే కేంద్రం పార్లమెంటు ప్రత్యేక సమావేశాలను నిర్వహిస్తోందని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళిని ఉల్లంఘించడమేనని తప్పుబట్టింది. పార్లమెంట్, అసెంబ్లీల్లో సీట్లను 50 శాతం పెంచాలనే నిర్ణయం ఏ ప్రాతిపదికన తీసుకున్నారని ప్రశ్నించింది. మహిళా రిజర్వేషన్ బిల్లు అమలుకు తాము అనుకూలమేనని, కానీ, ఎన్నికల సమయంలో నియోజకవర్గాల పునర్విభజనకు లింకు పెట్టి హడావుడిగా అమలు చేయడాన్నే తప్పుబడుతున్నామని కాంగ్రెస్ అగ్ర నాయకులు స్పష్టం చేశారు. ఇక్కడ సమస్య మహిళా రిజర్వేషన్ అమలు కాదని, ఎన్నికల ప్రక్రియ మధ్యలో ఉండగా అసెంబ్లీల్లో సీట్ల సంఖ్యను పెంచుతున్నామంటూ డీలిమిటేషన్ ప్రక్రియను రుద్దడాన్నే వ్యతిరేకిస్తున్నామని ఖర్గే, రాహుల్ గాంధీ స్పష్టం చేశారు. సీట్ల సంఖ్యను 50 శాతం పెంచడం ద్వారా దక్షిణాదికే కాకుండా ఉత్తరాదికి, ఈశాన్యానికి కూడా నష్టమని కాంగ్రెస్ పార్టీ అభిప్రాయపడింది. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, కర్ణాటక ముఖ్యమంత్రి సిద్దరామయ్య, హిమాచల్ ముఖ్యమంత్రి సుఖ్వీందర్ సింగ్ సుఖు, ఛత్తీస్‌గఢ్ మాజీ ముఖ్యమంత్రి భూపేశ్ భగేల్, పంజాబ్ మాజీ ముఖ్యమంత్రి చరణ్ జిత్ సింగ్ ఛన్నీ డీలిమిటేషన్ ప్రక్రియను తీవ్రంగా విమర్శించారు. లోక్‌సభ సీట్లను 50 శాతం పెంచితే దక్షిణాది రాష్ట్రాలకు తీవ్ర నష్టమని, ఉత్తరాదిలోని పెద్ద రాష్ట్రాల కంటే తాము వెనకబడిపోతామని రేవంత్ రెడ్డి, సిద్దరామయ్య, శశిథరూర్ తదితరులు తప్పుబట్టారు. సీడబ్ల్యూసీ సమావేశాన్ని ప్రారంభిస్తూ ఖర్గే మాట్లాడారు. కేవలం రాజకీయ ప్రయోజనాల కోసమే పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహిస్తోందని, ఇది ఎన్నికల ప్రవర్తన నియమావళికి విరుద్ధమని స్పష్టం చేశారు. ఈ రెండు సవరణలూ దేశ ఎన్నికల వ్యవస్థపై గణనీయంగా ప్రభావం చూపిస్తాయన్నారు. ప్రతిపక్షాలతో కలిసి, చర్చించి, ఈ విషయంలో ఐకమత్యంగా ముందుకు వెళ్లాలని ప్రతిపాదించారు. పశ్చిమ బెంగాల్‌లో పోలింగ్ పూర్తయిన తర్వాత అంటే ఏప్రిల్ 29వ తేదీ తర్వాత అఖిలపక్ష సమావేశం నిర్వహించాలని, ఈ అంశంపై పూర్తిస్థాయిలో చర్చించాలని పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజుజుకు తాను, ప్రతిపక్ష నేతలు లేఖ రాశామని ఖర్గే వెల్లడించారు. తామంతా ఉమ్మడిగా విజ్ఞప్తులు చేసినా ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కిందని, ఎన్నికల్లో ప్రయోజనమే పరమావధిగా సమావేశాల నిర్వహణకే మొగ్గు చూపిందని తప్పుబట్టారు. కాగా రాజ్యాంగంలో ఏయే సవరణలు చేపట్టనున్నారో తమకింత వరకూ సమాచారం లేదని సీనియర్ నేత జైరాం రమేశ్ వ్యాఖ్యానించారు.

## సంస్థాగతంగా పార్టీ బలోపేతం

**అంకిత భావంతో పనిచేసే నేతలకు ప్రాధాన్యం**

**బీజేపీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌తో రాంచందర్ రావు**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10**
తెలంగాణలో భారతీయ జనతా పార్టీ సంస్థాగతంగా బలోపేతం అవుతోందని, జీహెచ్ఎంసీ ఎన్నికలకు పార్టీ పూర్తి సిద్ధంగా ఉందని రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు రాంచందర్ రావు శుక్రవారం ఢిల్లీలో పార్టీ జాతీయ అధ్యక్షుడు నితిన్ నబీన్‌ను కలిసి వివరించారు. దీనదయాళ్ పేరిట విస్తృత స్థాయిలో చేపట్టిన శిక్షణ తరగతుల గురించి వివరించినప్పుడు పార్టీ నేతలు ఆయన్ను ప్రశంసించారు. సీనియర్ నేతల్లో అంకిత భావంతో పనిచేస్తున్న వారిని కమిటీల్లో నియమించి పార్టీని క్రియాశీలంగా మార్చినట్లు ఆయన వివరించారు. వివిధ రాష్ట్రాల్లో పార్టీ పనితీరును సమీక్షించేందుకు ఏర్పాటు చేసిన సమావేశంలో రాంచందర్ రావు పాల్గొన్నారు. త్వరలో ఓటర్ల జాబితా విస్తృత సవరణ జరుగుతున్నందువల్ల ఈ సవరణకు సంబంధించి పార్టీ నేతలకు పూర్తి అవగాహన కల్పించాలని నిర్ణయించారు. మహిళలకు 33 శాతం రిజర్వేషన్ కల్పించేందుకు కేంద్రం ప్రవేశపెట్టనున్న నారీ శక్తి వందన అధినియమ్‌పై మహిళల్లో పెద్ద ఎత్తున చైతన్యం కలిగించేందుకు కార్యక్రమాలను రూపొందించాలని నబీన్ సూచించారు. సమావేశంలో బీజేపీ జాతీయ సంఘటనా ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్, జాతీయ సహ సంఘటనా ప్రధాన కార్యదర్శి శివప్రకాశ్ తదితరులు పాల్గొన్నారు. ఈ పర్యటనలో రాజకీయాలు ఏమీ చర్చించలేదని రాంచందర్ రావు తెలిపారు.

## 1600 మంది ఆర్టిజన్లకు నోటీసులు

**24 గంటల్లోగా విధుల్లో చేరకుంటే సర్వీసు నుంచి తొలగిస్తామంటూ జెన్‌కో హెచ్చరికలు**

**సమస్యలు తీర్చిన తర్వాతే సమ్మె వీడుతామని ఆర్టిజన్ల స్పష్టీకరణ**

**హైదరాబాద్, ఏప్రిల్ 10**
సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేస్తున్న విద్యుత్ ఆర్టిజన్లతో ఇంధనశాఖ జరిపిన చర్చలు విఫలమయ్యాయి. ఆర్టిజన్ జేఏసీ చైర్మన్ సతీశ్‌రెడ్డితో శుక్రవారం ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి నవీన్‌మిట్టల్ భేటీ అయ్యారు. ఈ సందర్భంగా ముందు గా సమ్మె వీడాలని, ఆ తర్వాత జేఏసీ డిమాండ్లపై అవసరమైన చర్యలు తీసుకుంటామని నవీన్ మిట్ట ల్ ప్రతిపాదించారు. సమస్యలను పరిష్కరించిన తర్వాతే తాము సమ్మెను విరమిస్తామంటూ సతీశ్ రెడ్డి తేల్చిచెప్పారు. దీంతో రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెలో ఉన్న ఆర్టిజన్లకు జెన్‌కో నోటీసులు ఇవ్వడం ప్రారంభించింది. శు క్రవారం ఒక్కరోజే 1600 మంది కార్మికులకు నోటీసులు జారీ చేసింది. నోటీసులు అందిన 24 గంటల్లోగా విధుల్లో చేరని పక్షంలో సర్వీసుల నుంచి తొలగిస్తామని జెన్‌కో ఇప్పటికే హెచ్చరికలు జారీ చేసింది. కాగా, హైదరాబాద్, విద్యుత్ సౌధ వంటి చోట్ల పనిచేస్తున్న ఆర్టిజన్లు సమ్మెలో లేరు.

**ఆర్టిజన్లపై కఠిన చర్యలు వద్దు: కూనంనేని**
సమ్మెలో ఉన్న అర్టిజన్లపై ఎస్మా, డిస్మిస్, మెమో లాంటి బెదరింపు దోరణితో ఇబ్బందులకు గురి చేయవద్దని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాం బశివరావు ప్రభుత్వాన్ని కోరారు. ఈమేరకు శుక్రవారం సీఎం రేవంత్ రెడ్డికి లేఖ రాశారు. కార్మికుల న్యాయపరమైన సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని లేఖలో పేర్కొన్నారు.

## ఓర్వలేకే బీఆర్ఎస్ నేతల విమర్శలు!

**మీరు రుణమాఫీ ఎలా చేశారో అన్నదాతలకు ఇంకా గుర్తుంది: తుమ్మల**



**హైదరాబాద్, ఏప్రిల్ 10**
తమది రైతుల ప్రయోజనాలకు పెద్దపీట వేసే ప్రభుత్వం అని, వారికి ఇచ్చిన మాటకు కట్టుబడి నిర్ణయాలు తీసుకుంటున్నామని వ్యవసాయశాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చే నాటికి ఆర్థిక పరిస్థితి అస్తవ్యస్తంగా ఉన్నప్పటికీ, ఎన్నికల సమయంలో రైతులకు ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడానికి 2 లక్షల లోపు ఉన్న పంట రుణాలను మాఫీ చేశామని, తద్వారా చేసి దేశవ్యాప్తంగా ప్రశంసలు అందుకున్నట్లు తెలిపారు. ఎన్నో రాష్ట్రాలు ఆర్థికంగా బలంగా ఉన్నప్పటికీ ఇలాంటి సాహసోపేతమైన నిర్ణయాన్ని తీసుకోలేకపోయాయన్నారు. గత బీఆర్ఎస్ సర్కారు ఏ విధంగా రుణమాఫీ చేసిందనేది రైతులకు ఇంకా గుర్తుందని ఎద్దేవా చేశారు. రైతులకు తమ ప్రభుత్వం చేస్తున్న ప్రయోజనాలను చూసి ఓర్వలేకే బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని ఆక్షేపించారు. బీఆర్ఎస్ నేతల విమర్శలు పూర్తిగా అర్థరహితమైనవని.. ప్రభుత్వాన్ని మెచ్చుకోకపోయినా పర్వాలేదు గానీ విమర్శలు మానుకోవాలని హితవు పలికారు. ఈమేరకు ఆయన శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు. బీఆర్ఎస్ 2014లో అధికారంలోకి వచ్చే నాటికి రాష్ట్రం మిగులు బడ్జెట్‌తో ఉందని, అయినప్పటికీ రూ.లక్ష వరకు రుణమాఫీని ఒకేసారి చేయలేక పోయారని అన్నారు. ఫలితంగా రైతులకు రుణమాఫీ కాకపోగా.. రూ. 2,630 కోట్ల వడ్డీ భారం పడిందన్నారు. అయినప్పటికీ రైతులు నమ్మి బీఆర్ఎ?సకు రెండోసారి అధికారం అప్పగిస్తే 2018-23 వరకు అధికారంలో ఉండి మరోసారి రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేశారని విమర్శించారు. 2018లో లక్ష వరకు పంట రుణమాఫీ చేస్తామని చెప్పి, దానిని దశలవారీగా అమలు చేయడం ద్వారా రూ. 8,515 కోట్ల వడ్డీభారం పడటంతో పాటు, రూ. 8,379 కోట్లు పూర్తిగా ఎగ్గొట్టారని విమర్శించారు. అంతేకాకుండా రూ. 1,419 కోట్ల నిధులు ఖాతాలు సరిగ్గా లేనందున వెనక్కి వెళ్లిపోయాయని పేర్కొన్నారు. అధికారంలో ఉన్న పదేళ్ల పాటు రైతులను నిర్లక్ష్యం చేసిన ప్రభుత్వం ఇప్పుడు రైతులపై ప్రేమ నటించడం కపటత్వానికి నిదర్శమని అన్నారు.

## బీఆర్ఎస్ అవినీతి పరంపరను కొనసాగిస్తున్న సీఎం రేవంత్

**హైదరాబాద్, ఏప్రిల్ 10**



పురపాలక శాఖను తనవద్దే అట్టిపెట్టుకున్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, జీహెచ్ఎంసీని అవినీతికి చిరునామా అన్నట్లుగా మార్చేశారని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆరోపించారు. నిబంధనలకు వ్యతిరేకంగా రూ.కోట్ల విలువైన పనులను టెండర్లు లేకుండానే కట్టబెడుతున్నారని, ఇది తెలంగాణ స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌ను ఉల్లంఘించడమేనని పేర్కొన్నారు. ప్రభుత్వ విభాగాల్లో రూ. ఐదు లక్షలకు మించి పనులకు సంబంధించిన కాంట్రాక్టులను టెండర్ల ద్వారా కట్టబెట్టాలని, అందుకు విరుద్ధంగా జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ పరిధిలో నామినేషన్ పద్ధతిన కాంట్రాక్టులు ఇచ్చారని కవిత ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.480 కోట్ల పనులను నిబంధనలకు విరుద్ధంగా కట్టబెట్టిందని, ఆ అవినీతి పరంపరను రేవంత్‌రెడ్డి కొనసాగిస్తున్నారని ఆరోపించారు. శుక్రవారం జాగృతి కార్యాలయంలో కవిత మీడియాతో మాట్లాడారు. రూ.1,148 కోట్ల పనులను సీఎం తన అనుచరులకు నామినేషన్ పద్ధతిలో ఇప్పించారని, ఇందులో పెద్ద ఎత్తున అవినీతి జరిగిందని ఆరోపించారు. ప్రభుత్వం ఆయా విభాగాల్లో నామినేషన్ పద్ధతిలో ఎంపిక చేసిన సంస్థలు స్కిల్డ్ లేబర్‌కు ఇచ్చే జీతాల్లో కోత పెడుతున్నారని.. రూ.23 వేలవరకు జీతాలివ్వాల్సి ఉండగా, రూ.13వేలు మా త్రమే ఇస్తున్నారన్నారు.

# నివురుగప్పిన నిప్పు!

## కాల్పుల విరమణ ఉన్నా పశ్చిమాసియాలో తగ్గని ఉద్రిక్తత



**దుబాయ్/టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 10:**
పశ్చిమాసియాలో పరిస్థితి నివురుగప్పిన నిప్పులా ఉంది. ఇరాన్, అమెరికా, ఇజ్రాయెల్, గల్ఫ్ దేశాలపై దాడులు ఆగినా ఉద్రిక్తత మాత్రం కొనసాగుతోంది. లెబనాన్‌పై దాడుల నిలిపివేతపై చిక్కుముడి మరింత బిగుసుకుంది. మరికొన్ని గంటల్లో ఇస్లామాబాద్ వేదికగా చర్చలు జరగాల్సి ఉండగా.. ఎప్పుడేం జరుగుతుందోనన్న ఆందోళన కొనసాగుతోంది. లెబనాన్‌పై దాడులను తగ్గించాలని అమెరికా అధ్యక్షుడు ట్రంప్ స్వయంగా సూచించినా ఇజ్రాయెల్ మాత్రం వెనక్కి తగ్గలేదు. శు క్రవారం కూడా భారీ స్థాయిలో దాడులు చేసింది. లెబనాన్‌లో దాడులు ఆపేదాకా చర్చల ప్రసక్తే లేదని ఇరాన్ స్పష్టం చేసింది. ఇక చర్చలు సఫలం కాకపోతే భారీ స్థాయిలో దాడులకు సిద్ధమని అమెరికా హెచ్చరిస్తే.. తమ వేలు ట్రిగ్గర్‌పై సిద్ధంగా ఉందని ఇరాన్ తేల్చిచెప్పింది. దీంతో శనివారం పాకిస్థాన్‌లో చర్చలు ఎలా సాగుతాయనే దానిపై ఉత్కంఠ కొనసాగుతోంది.

**లెబనాన్‌పై దాడులు**
లెబనాన్‌పై ఇజ్రాయెల్ దాడులు శుక్రవారం కూడా కొనసాగాయి. దక్షిణ లెబనాన్‌లోని నబతియే, టైర్, బెక్కా, అల్‌టైరీ, సహ్మారీ, బింట్ జబేల్, అల్ అన్సార్, బేట్ యహోన్ పట్టణాలపై వైమానిక దాడులు జరిగాయి. 12 మంది భద్రతా సిబ్బంది మృతిచెందారని లెబనాన్ జాతీయ వార్తా సంస్థ వెల్లడించింది. జబా పట్టణంలో ఆరుగురు, సహ్మారీలో ఇద్దరు మృతిచెందారని తెలిపింది. దేర్ ఖనౌన్ రాస్ అలిన్ పట్టణంలో పలు అంబులెన్సులు, అగ్నిమాపక వాహనాలను ఇజ్రాయెల్ ధ్వంసం చేసిందని పేర్కొంది. మొత్తంగా హెజ్బొల్లాకు చెందిన 4,300 ప్రాంతాలపై దాడులు చేసి, 1,400 మందికిపైగా ఆ గ్రూపు మెంబర్లను హతం చేసినట్టు ఇజ్రాయెల్ మిలిటరీ ప్రకటించింది. మరోవైపు ఇజ్రాయెల్‌లోని ఆష్డోద్ నౌకాదళ స్థావరం, హైఫా ప్రాంతాలపై హెజ్బొల్లా రాకెట్ దాడులు చేసింది. ఉత్తర ఇజ్రాయెల్‌లోని కిర్యత్ షిమోనా, మెటులా, మార్గలియత్, మిస్గావ్ పట్టణాలపైకి డ్రోన్లను ప్రయోగించింది. కాగా, తమ ఊపిరి ఉన్నంత వరకు ఇజ్రాయెల్‌తో పోరాడుతామని హెజ్బొల్లా చీఫ్ నయీమ్ ఖసేమ్ శుక్రవారం ప్రకటించారు. ఇజ్రాయెల్ దాడులతో లెబనాన్‌లో 10 లక్షల మందికిపైగా నిరాశ్రయులయ్యారని.. వేలాది మంది గాయపడ్డారని ఐక్యరాజ్యసమితి ప్రపంచ ఆహార కార్యక్రమం (డబ్ల్యూఈపీ) విభాగం పేర్కొంది. లెబనాన్‌లో దారుణమైన మానవతా సంక్షోభం పొంచి ఉందని హెచ్చరించింది. బాధిత ప్రజలకు అత్యవసర సాయం అందించేందుకు కూడా వీలవని పరిస్థితి నెలకొందని డబ్ల్యూఈపీ లెబనాన్ డైరెక్టర్ అలిసన్ లావి పేర్కొన్నారు.

**నేడే ఇస్లామాబాద్‌లో చర్చలు**
అమెరికా-ఇరాన్ చర్చల కోసం పాకిస్థాన్ ఇస్లామాబాద్‌లో ఏర్పాట్లు పూర్తి చేసింది. నగరంలో ప్రభుత్వ భవనాలు, దౌత్యకార్యాలయాలు ఉన్న రెడ్ జోన్ ప్రాంతంలో 10 వేల మంది మిలిటరీ, పోలీసు సిబ్బందితో కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేసింది. నగరంలో శుక్ర, శని, ఆదివారాల్లో సెలవులు ప్రకటించింది. రెడ్ జోన్ వైపు ఎవరూ రాకుండా ఆంక్షలు విధించింది. అమెరికా, ఇరాన్ కీలక నేతలు వస్తుండటంతో ముందుగానే ఆయా దేశాల ప్రతినిధులు చేరుకుని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు.

# తెలంగాణ.. మావోయిస్టు రహితం: డీజీపీ

**ఆయన సమక్షంలో 42మంది మావోయిస్టుల లొంగుబాటు**

**భారీగా ఆయుధాలు, 800 గ్రాముల బంగారం అప్పగింత**

**వారికి రూ.1.93 కోట్ల రివార్డు.. త్వరలోనే హెల్త్‌కార్డులు: డీజీపీ**



**హైదరాబాద్, ఏప్రిల్ 10**
తెలంగాణ మావోయిస్టు రహిత రాష్ట్రంగా మారిందని.. డీజీపీ శివధర్ రెడ్డి అన్నారు. మావోయిస్టు పార్టీకి చెందిన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ పీఎల్‌జీఏ, తెలంగాణ రాష్ట్ర కమిటీ, దండకారణ్య స్పెషల్ జోనల్ కమిటీలకు చెందిన 42 మంది మావోయిస్టులు డీజీపీ సమక్షంలో శుక్రవారం జనజీవన స్రవంతిలోకి వచ్చారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీ జీరో అయ్యిందని, పీఎల్‌జీఏ కనుమరుగైందన్నారు. తెలంగాణకు చెందిన ఐదుగురు మావోయిస్టులు ఇంకా పార్టీలో మిగిలి ఉన్నారని తెలిపారు. ఆ ఐదుగురూ.. మావోయిస్టు అగ్రనేత గణపతి, ఆయన భార్య జోడే రత్నాభాయి, ఛత్తీస్‌గఢ్‌లో పనిచేస్తున్న వార్త శేఖర్, ఆయన భార్య రంగబోయిన భాగ్య, పసునూరి నరహరి అని వెల్లడించారు. సీఎం రేవంత్ రెడ్డి పిలుపుమేరకు జనజీవన స్రవంతిలోకి రావాల్సిందిగా వారిని కూడా ఆహ్వానిస్తున్నామని డీజీపీ పేర్కొన్నారు. గణపతి బతికే ఉన్నారుగానీ.. ఆయన అడవిలో మాత్రంలేరని తెలిపారు. ఆయన ఎక్కడ ఉన్నారో లొంగిపోయిన మావోయిస్టులకూ సమాచారం లేదని తెలిపారు. లొంగిపోయిన మావోయిస్టులకు సర్కారు ప్రకటించిన మేరకు.. త్వరలో హెల్త్‌కార్డులను త్వరలో అందించ ^నున్నామని, దీనికి సంబంధించిన జీవో 1-2 రోజుల్లో విడుదల అవుతుందని చెప్పారు.

# తెలంగాణలో మావోయిస్టుల భారీ లొంగుబాటు

**డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో 42 మంది జనజీవన స్రవంతిలోకి**

**పీఎల్‌జీఏ బెటాలియన్ కమాండర్ సోడి మల్ల సహా కీలక నేతల లొంగుబాటు**

**భారీగా ఆయుధాలు, 800 గ్రాముల బంగారం పోలీసులకు అప్పగింత**

**కోటీ 93 లక్షల రివార్డు ప్రకటించిన ప్రభుత్వం - పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీకి భారీ దెబ్బ**



హైదరాబాద్, ఏప్రిల్ 10

: తెలంగాణ రాష్ట్రంలో మావోయిస్టుల ఏరివేత మరియు పునరావాస ప్రక్రియలో భాగంగా ఈరోజు ఒక చారిత్రాత్మక ఘట్టం ఆవిష్కృతమైంది. రాష్ట్ర పోలీసు ప్రధాన కార్యాలయంలో డీజీపీ శివధర్ రెడ్డి సమక్షంలో మొత్తం 42 మంది మావోయిస్టులు ఏకకాలంలో లొంగిపోయారు. గత కొంతకాలంగా మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో పోలీసులు గస్తీ ముమ్మరం చేయడం, గాలింపు చర్యలు పెంచడం మరియు ప్రభుత్వ పునరావాస పథకాలపై అవగాహన కల్పించడంతో ఈ భారీ లొంగుబాటు సాధ్యమైందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ పరిణామం రాష్ట్రంలో మావోయిస్టుల ప్రాబల్యాన్ని మరింత తగ్గించడమే కాకుండా, అడవి బాట పట్టిన వారిని జనజీవన స్రవంతిలోకి తీసుకురావడంలో పోలీసుల కృషిని చాటిచెప్పింది.లొంగిపోయిన వారిలో మావోయిస్టు పార్టీకి చెందిన అత్యంత కీలక నాయకులు ఉండటం గమనార్హం. పీఎల్‌జీఏ (గ్రూ+ూ) బెటాలియన్ కమాండర్ మరియు డీకేఎస్‌జెడ్‌సీ సభ్యుడు సోడి మల్ల అలియాస్ కేషాల్, జేఎంఎండబ్ల్యూసీ డివిజనల్ కమిటీ కార్యదర్శి చాప నారాయణ అలియాస్ గజేందర్, మరియు బీకే ఎఎస్ఆర్ డివిజనల్ కమిటీ సభ్యుడు కడ్తి సన్ను వంటి అగ్రశ్రేణి నేతలు డీజీపీ ఎదుట లొంగిపోయారు. వీరంతా పొరుగు రాష్ట్రమైన ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వారని పోలీసులు వెల్లడించారు. ఈ అగ్రనేతలు జనజీవన స్రవంతిలో కలవడం వల్ల సీపీఐ మావోయిస్టు పార్టీలోని మూడు మ్యాజిక్ వెపన్స్‌లో అత్యంత కీలకమైన పీపుల్స్ లిబరేషన్ గెరిల్లా ఆర్మీ (గ్రూ+ూ) దాదాపు కనుమరుగు అయిందని డీజీపీ ప్రకటించారు. మావోయిస్టులు తమ వెంట భారీగా ఆయుధాలను మరియు సామగ్రిని తీసుకువచ్చి పోలీసులకు అప్పగించారు. లొంగిపోయిన వారి నుంచి ఐదు ఏకే-47 రైఫిళ్లు, నాలుగు ఎస్‌ఎల్ఆర్ రైఫిళ్లు, మూడు ఇన్‌సాస్ రైఫిళ్లు, ఆరు 303 రైఫిళ్లు, ఒక 9ఎంఎం స్టెన్ గన్ మరియు ఒక 9ఎంఎం పిస్టల్‌తో పాటు మొత్తం 36 ఆయుధాలను స్వాధీనం చేసుకున్నారు.




వీటితో పాటు 1007 తూటాలు మరియు సుమారు 800 గ్రాముల బంగారాన్ని కూడా పోలీసులకు అప్పగించారు. ఇంత భారీ స్థాయిలో ఆయుధాలను అప్పగించి లొంగిపోవడం ఇటీవలి కాలంలో ఇదే అతిపెద్ద ఘటనగా పోలీసు వర్గాలు పేర్కొంటున్నాయి. ఆయుధాలను వీడటమే కాకుండా అడవిలో తాము దాచుకున్న విలువైన వస్తువులను కూడా అప్పగించడం వారిలో వచ్చిన మార్పుకు నిదర్శనమని డీజీపీ అభిప్రాయపడ్డారు.లొంగిపోయిన మావోయిస్టులకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తక్షణ ఆర్థిక సహాయం మరియు పునరావాస సౌకర్యాలను కల్పించనున్నట్లు డీజీపీ శివధర్ రెడ్డి వెల్లడించారు. లొంగిన వారందరికీ కలిపి మొత్తం ఒక కోటీ 93 లక్షల రూపాయల రివార్డు సొమ్మును త్వరలోనే అందజేస్తామని ప్రకటించారు. హింసను వీడి జనజీవన స్రవంతిలో చేరిన వారికి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, వారికి ఉపాధి అవకాశాలు మరియు సామాజిక భద్రత కల్పిస్తామని భరోసా ఇచ్చారు. ఇంకా అడవిలో ఉన్న మావోయిస్టులు కూడా తమ ఆయుధాలను వీడి, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలను విడిచిపెట్టి సాధారణ పౌరులుగా జీవించాలని సూచించారు. మీడియా సమావేశంలో డీజీపీ శివధర్ రెడ్డి ఈ లొంగుబాటుకు సంబంధించిన పూర్తి వివరాలను అధికారికంగా ప్రకటించారు. మావోయిస్టు సానుభూతిపరులు మరియు మిలిషియా సభ్యులు కూడా క్రమంగా జనజీవన స్రవంతిలోకి వస్తున్నారని, ఇది తెలంగాణ పోలీసుల వ్యూహాత్మక విజయమని పేర్కొన్నారు. ఛత్తీస్‌గఢ్ సరిహద్దు ప్రాంతాల్లో నిరంతర నిఘా మరియు గాలింపు చర్యల వల్లే మావోయిస్టులపై ఒత్తిడి పెరిగిందని, తద్వారా వారు లొంగిపోయేందుకు మొగ్గు చూపుతున్నారని విశ్లేషించారు. రాష్ట్రంలో శాంతిభద్రతల పరిరక్షణకు ఈ పరిణామం ఎంతో దోహదపడుతుందని, ప్రజల సహకారంతో మావోయిస్టు రహిత తెలంగాణను నిర్మిస్తామని డీజీపీ ధీమా వ్యక్తం చేశారు.

# రౌడీ షీటర్లకు డ్రగ్ టెస్ట్ షాక్

**హైదరాబాద్ సిటీ పోలీస్ మెరుపు తనిఖీలు - హెచ్-న్యూ, టాస్క్ ఫోర్స్ ఆధ్వర్యంలో 239 మందికి వైద్య పరీక్షలు**

**పరీక్షల్లో 189 మందికి డ్రగ్స్ అలవాటు ఉన్నట్లు నిర్ధారణ - మాదకద్రవ్యాల నిర్మూలనే లక్ష్యంగా కమిషనర్ ఆదేశాలతో ప్రత్యేక డ్రైవ్**



హైదరాబాద్, ఏప్రిల్ 10

నగరంలో మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు హైదరాబాద్ సిటీ పోలీస్ మరో కీలకమైన అడుగు వేసింది. నగర పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు హెచ్-న్యూ, టాస్క్ ఫోర్స్ మరియు లోకల్ పోలీసులు సమన్వయంతో రౌడీ షీటర్లు మరియు అనుమానిత డ్రగ్ వినియోగదారులపై మెరుపు దాడులు నిర్వహించారు. ఏప్రిల్ 9వ తేదీన చేపట్టిన ఈ ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా రౌడీ షీటర్లు, గతంలో డ్రగ్స్ కేసుల్లో ఉన్నవారు మరియు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వ్యక్తులకు ఆకస్మికంగా డ్రగ్ డిటెక్షన్ పరీక్షలు నిర్వహించి షాక్ ఇచ్చారు. ఈ వినూత్న సోదాల్లో భాగంగా మొత్తం 239 మందిని అదుపులోకి తీసుకుని ఉస్మానియా జనరల్ హాస్పిటల్, గాంధీ హాస్పిటల్ మరియు ఎర్రగడ్డలోని మానసిక చికిత్సాలయంలో వైద్య పరీక్షలు చేయించారు. ఈ పరీక్షల ఫలితాల్లో విస్తుపోయే నిజాలు వెలుగులోకి వచ్చాయి. పరీక్షలు చేయించుకున్న 239 మందిలో ఏకంగా 189 మంది డ్రగ్స్ వాడుతున్నట్లు వైద్య నివేదికల్లో తేలింది. ఇంత భారీ స్థాయిలో పాజిటివ్ కేసులు రావడం నగరంలో డ్రగ్స్ నెట్‌వర్క్ ఎంత లోతుగా ఉందో చాటిచెబుతోంది. బాధితులందరికీ ఆయా ఆసుపత్రుల్లోని సైకియాట్రిస్టుల ద్వారా కౌన్సెలింగ్ ఇప్పించి, డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలను వివరించారు.డ్రగ్స్ తీసుకున్నట్లు నిర్ధారణ అయిన 189 మందిపై పోలీసులు చట్టపరమైన చర్యలు ప్రారంభించారు. కేవలం శిక్షించడమే కాకుండా, వారిని వ్యసనం నుంచి దూరం చేసేందుకు అవసరమైన పునరావాస కేంద్రాలకు పంపేలా పోలీసులు చర్యలు తీసుకుంటున్నారు. రౌడీ షీటర్లు డ్రగ్స్ మత్తులో మరింత దారుణమైన నేరాలకు పాల్పడే అవకాశం ఉన్నందున, ముందస్తు జాగ్రత్తగా ఈ డ్రైవ్ నిర్వహించినట్లు ఉన్నతాధికారులు వెల్లడించారు. ఈ సోదాల్లో హెచ్-న్యూ మరియు టాస్క్ ఫోర్స్ సీనియర్ అధికారులు పాల్గొని స్వయంగా పర్యవేక్షించారు.హైదరాబాద్ నగరాన్ని డ్రగ్స్ రహిత నగరంగా మార్చడమే తమ ప్రథమ ప్రాధాన్యత అని సిటీ పోలీస్ మరోసారి స్పష్టం చేసింది. మాదకద్రవ్యాల సరఫరాదారులనే కాకుండా, వాటిని అలవాటు చేసుకున్న వారిపై కూడా నిఘా ఉంచుతామని హెచ్చరించింది. ఇటువంటి ఆకస్మిక తనిఖీలు భవిష్యత్తులో కూడా కొనసాగుతాయని, ఎవరైనా చట్టవిరుద్ధమైన కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని కమిషనర్ కార్యాలయం నుంచి ప్రకటన వెలువడింది. ఈ చర్యతో నగరంలోని అసాంఘిక శక్తుల్లో వణుకు మొదలైంది. మరోవైపు పోలీసుల తీసుకుంటున్న ఈ చొరవను నగర ప్రజలు అభినందిస్తున్నారు. కేవలం అరెస్టులతో సరిపెట్టకుండా బాధితులకు అవగాహన కల్పించడం మరియు పునరావాసం కల్పించడం వంటి మానవీయ కోణంలో ఆలోచించడం మంచి పరిణామమని మేధావులు అభిప్రాయపడు తున్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా తల్లిదండ్రులు కూడా అప్రమత్తంగా ఉండాలని పోలీసులు ఈ సందర్భంగా కోరారు. ఏదైనా అనుమానాస్పద సమాచారం ఉంటే వెంటనే డయల్ 100 లేదా హెచ్-న్యూ విభాగానికి తెలియజేయాలని విజ్ఞప్తి చేశారు.

## ప్రతి గడపకూ సంక్షేమ కాంతి

**- కూసుమంచిలో మంత్రి పొంగులేటి పర్యటన**

**- రైతు సంక్షేమానికి ప్రభుత్వ ప్రాధాన్యం**

**- ప్యాక్స్ గోదాముల ప్రారంభం -- మౌలిక వసతుల బలోపేతం**

**- సిఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ పేదలకు ఊరట**

ఖమ్మం, ఏప్రిల్ 10

రాష్ట్రంలో ప్రతి గడపకూ సంక్షేమం చేరవేసి, ప్రతి రైతుకు ప్రభుత్వ భరోసా కల్పించాలనే లక్ష్యంతో ప్రభుత్వం పనిచేస్తోందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. శుక్రవారం కూసుమంచి మండలంలో సుడిగాలి పర్యటన చేపట్టి పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ప్రజలతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకున్నారు.చేగొమ్మ గ్రామంలో రూ. 1.52 కోట్ల వ్యయంతో నిర్మించిన ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం గోదాములను మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతును రాజు చేయడమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. పంట దిగుబడులు పెరగడంలో, నిల్వ సదుపాయాలు మెరుగుపడడంలో ఈ గోదాములు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు.రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను మంత్రి వివరించారు. కేవలం నాలుగు నెలల్లోనే భారీ స్థాయిలో రుణమాఫీ చేపట్టి చరిత్ర సృష్టించామని తెలిపారు. రైతులకు ఎకరానికి ఆర్థిక సహాయం అందించడం, పంటలకు బోనస్ ఇవ్వడం వంటి చర్యల ద్వారా వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేస్తున్నామని పేర్కొన్నారు. భూ వివాదాల పరిష్కారానికి కొత్త పాస్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నామని వివరించారు. కూసుమంచి క్యాంప్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో 191 మంది బాధితులకు రూ. 58.58 లక్షల విలువైన ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను మంత్రి పంపిణీ చేశారు. వైద్యం కోసం పేదలు అప్పుల పాలవకుండా ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటోందని తెలిపారు. ఆరోగ్య సేవల కోసం మరింత నిధులు కేటాయిస్తున్నామని చెప్పారు.అనంతరం వెంకటాపురం గ్రామంలో ఇందిరమ్మ ఇంటి గృహప్రవేశ కార్యక్రమంలో మంత్రి పాల్గొన్నారు. అర్హులైన ప్రతి పేద కుటుంబానికి సొంతింటి కలను నిజం చేయడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని తెలిపారు. గృహ నిర్మాణ పథకాల ద్వారా ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపడతాయని పేర్కొన్నారు.ఈ కార్యక్రమాల్లో జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమిషనర్ సునీల్ దత్, మునిసిపల్ చైర్‌పర్సన్ పోకబత్తిని అనిత, ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేసి ప్రజలకు చేరవేయాలని మంత్రి ఆదేశించారు.

## కుళ్లిన మాంసం సరఫరా ముఠా గుట్టురట్టు

**బాలాపూర్‌లో నలుగురి అరెస్టు.. పరారీలో ముఠా యజమాని**

హైదరాబాద్ సిటీ/పహాడీషరీఫ్, ఏప్రిల్ 10



హైదరాబాద్‌లోని పలు హోటళ్లు, దుకాణాలకు కుళ్లిన మేక తలకాయ మాంసం, చేపలు సరఫరా చేస్తున్న ముఠాకు చెందిన నలుగురు వ్యక్తులను పోలీసులు అరెస్టు చేశారు. ఈ ముఠా యజమాని పరారీలో ఉన్నాడు. బాలాపూర్‌లోని షాహిన్ నగర్, షాజహాన్ కాలనీలో కొందరు కుళ్లిన మేక తలకాయ/ కాళ్ల మాంసం, చేపలను సరఫరా చేస్తున్నట్లు అందిన విశ్వసనీయ సమాచారం మేరకు బాలపూర్ పోలీసులు, జీహెచ్ఎంసీ అధికారులు శుక్రవారం అకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో 4 టన్నుల కోడి వ్యర్థాలు, 6 టన్నుల కుళ్లిన మేక తలకాయ/ కాళ్ల మాంసం/ బోటి, 2 టన్నుల కుళ్లిన చేపలను స్వాధీనం చేసుకున్నారు. వీటిని సరఫరా చేస్తున్న నలుగురు వ్యక్తులు మెఫీద్ ఖాన్, గులాం ఉస్మానీ, షేక్ మున్నా షైల్, మహ్మద్ ముజీబ్‌లను అరెస్టు చేసి విచారించగా.. వట్టేపల్లి వాసి అబ్దుల్ గఫార్ అనే వ్యక్తి ఐదేళ్లుగా అక్కడ షెడ్డు వేసి ఈ దందాతో డబ్బు సంపాదిస్తున్నట్లు తేలింది. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ధాన్యం దిగుబడి జాస్తి..బియ్యం సేకరణ నాస్తి!

హైదరాబాద్, ఏప్రిల్ 10


వానా కాలం, యాసంగి అనే తేడా లేకుండా వరి పంట రైతుల ఇంట సిరులు కురిపిస్తోంది.2 సీజన్లలోనూ రికార్డు స్థాయిలో ధాన్యం దిగుబడి వస్తోంది. రాష్ట్ర ప్రభుత్వం ఊరూరా కొనుగోలు కేంద్రాలు పెట్టి రైతుల నుంచి కనీస మద్దతు ధర (ఎమ్మెస్పీ)కి వడ్లు కొనుగోలు చేస్తోంది. అయితే వాటిని బియ్యంగా మార్చేసి కేంద్రానికి అప్పగించడ మే గగనమవ్ఁతోంది. ఫలితంగా ఏటేటా వరి ధాన్యం దిగుబడి పెరుగుతుండగా.. దానికి తగినట్లుగా భార త ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) సీఎంఆర్ (కస్టమ్ మిల్లింగ్ రైస్) టార్గెట్ ఇవ్వటంలేదు. ఏడాదికేడాది కోటా తగ్గిస్తూ వస్తోంది. ఆరేళ్ల క్రితం 62 లక్షల మె ట్రిక్ టన్నుల బియ్యాన్ని తీసుకున్న కేంద్రం... ఈసారి 45లక్షల మెట్రిక్ టన్నుల బియ్యాన్నే తీసు కుంది బాయిల్డ్ రైస్ (ఉప్పుడు బియ్యం) కోటానైతే గణనీయంగా తగ్గిస్తోంది. 2019-20లో 92.50న్ల ఉప్పుడు బియ్యం తీసుకుంటే, 2024-25లో 66.78 శాతమే తీసుకుంది. రాష్ట్రంలో ఒకవైపు ధాన్యం దిగు బడి, రైతుల నుంచి కొనుగోళ్లు భారీగా పెరుగు తుంటే.. మరోవైపు కేంద్రం ఏటేటా కోటా తగ్గిస్తూ పోతోంది.

# పైలట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో అఘాయిత్యం

**శిక్షకుడి వికృత చేష్టలు- శిక్షణ సాకుతో విద్యార్థినిపై అత్యాచారం చేసిన కేరళ వ్యక్తి**

**వీడియోలు తీసి బ్లాక్‌మెయిల్.. ఏడాది కాలంగా లైంగిక దాడి- ప్రధాన నిందితుడు నసీముద్దీన్‌ను అరెస్ట్ చేసిన బేగంపేట పోలీసులు**

హైదరాబాద్, ఏప్రిల్ 10 : హైదరాబాద్‌లోని బేగంపేటలో ఉన్న ఒక పైలట్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లో దారుణ ఘటన వెలుగులోకి వచ్చింది. విద్యార్థినులకు మార్గదర్శకంగా ఉండి శిక్షణ ఇవ్వాల్సిన ఉపాధ్యాయుడే ఒక యువతిపై అఘాయిత్యానికి ఒడిగట్టడం స్థానికంగా తీవ్ర కలకలం రేపింది. వివరాల్లోకి వెళితే, సదరు ఇన్‌స్టిట్యూట్‌లో పైలట్ శిక్షణ పొందుతున్న ఓ విద్యార్థినిపై అదే సంస్థలో పనిచేస్తున్న నసీముద్దీన్ అనే వ్యక్తి లైంగిక దాడికి పాల్పడ్డాడు. కేరళ రాష్ట్రానికి చెందిన నిందితుడు, గతేడాది జనవరిలో శిక్షణ ఇస్తాననే సాకుతో ఆమెను నమ్మించి వికృత చేష్టలకు పాల్పడ్డాడు. విద్యార్థిని ఒంటరిగా ఉన్న సమయం చూసి ఆమెపై అత్యాచారం చేసినట్లు పోలీసులు వెల్లడించారు. తొలిసారి అఘాయిత్యం చేసిన సమయంలో నిందితుడు అత్యంత నీచంగా ఆ దృశ్యాలను ఫొటోలు మరియు వీడియోలు తీశాడు. ఈ వీడియోలను సోషల్ మీడియాలో పోస్ట్ చేస్తానని, నీ పరువు తీస్తానని బాధితురాలిని బెదిరించడం మొదలుపెట్టాడు. తన మాట వినకపోతే కెరీర్ నాశనం చేస్తానని బ్లాక్‌మెయిల్ చేస్తూ గతేడాది కాలంగా ఆమెపై పలుమార్లు లైంగిక దాడికి పాల్పడ్డాడు. ఈ వేధింపుల వల్ల తీవ్ర మానసిక క్షోభకు గురైన బాధితురాలు, నిందితుడి ఆగడాలు మితిమీరడంతో ఎట్టకేలకు ధైర్యం చేసి బేగంపేట పోలీసులను ఆశ్రయించింది. తనపై జరిగిన అఘాయిత్యం గురించి ఫిర్యాదు చేయడంతో ఈ దారుణ విషయం బయటపడింది.ఈ కేసులో మరో వ్యక్తి ప్రమేయం కూడా ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొంది. దమ్మాయిగూడకు చెందిన సల్మాన్ అనే వ్యక్తి నిందితుడు నసీముద్దీన్‌కు సహకరించినట్లు ఆమె తెలిపింది. బాధితురాలిని బ్లాక్‌మెయిల్ చేయడంలో, ఆమెను వేధించడంలో సల్మాన్ కూడా కీలక పాత్ర పోషించినట్లు సమాచారం. బాధితురాలి వాంగ్మూలాన్ని నమోదు చేసుకున్న పోలీసులు, ఐపీసీలోని వివిధ సెక్షన్లతో పాటు ఐటీ చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ నేరంలో నిందితుడికి సహకరించిన వారి పాత్రపై కూడా పోలీసులు లోతుగా విచారణ జరుపుతున్నారు. విద్యార్థిని ఇచ్చిన ఆధారాలతో పోలీసులు దర్యాప్తును వేగవంతం చేశారు.ఫిర్యాదు అందిన వెంటనే స్పందించిన బేగంపేట పోలీసులు బుధవారం ప్రధాన నిందితుడు నసీముద్దీన్‌ను అరెస్ట్ చేశారు. పరారీలో ఉన్న మరో నిందితుడు సల్మాన్ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విద్యా సంస్థల్లో ఇటువంటి ఘటనలు జరగడం పట్ల విద్యార్థినిల తల్లిదండ్రులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. నిందితుడికి కఠిన శిక్ష పడేలా చూస్తామని మరియు బాధితురాలికి న్యాయం చేస్తామని పోలీసులు హామీ ఇచ్చారు. ప్రస్తుతం నిందితుడిని రిమాండ్‌కు తరలించే ప్రక్రియ జరుగుతోంది.



ఇన్‌స్టిట్యూట్‌లోని ఇతర సిబ్బందిని కూడా పోలీసులు విచారిస్తున్నట్లు తెలుస్తోంది .నగరంలోని ప్రతిష్టాత్మకమైన శిక్షణా కేంద్రాల్లో ఇటువంటి సంఘటనలు చోటుచేసుకోవడం విద్యా వ్యవస్థకే మచ్చ తెచ్చేలా ఉందని సామాజిక కార్యకర్తలు అభిప్రాయప డుతున్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం ఎన్ని చట్టాలు తీసుకువస్తున్నా, కామాంధుల ఆగడాలు తగ్గడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులైన అందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేస్తున్నారు. పోలీసులు బాధితురాలికి కౌన్సెలింగ్ ఏర్పాటు చేయడంతో పాటు ఆమె ప్రైవసీకి భంగం కలగకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ కేసు హైదరాబాద్ పోలీసు వర్గాల్లో పెద్ద చర్చకు దారితీసింది.

# హెచ్ఎండీఏ కాంట్రాక్టుల్లో భారీ అవినీతి

**అవినీతి కాంగ్రెస్ పాలన కవిత ధ్వజం**

**రూ.1,142 కోట్ల పనులు నామినేషన్ పద్ధతిలో కట్టబెట్టడంపై ఆగ్రహం**

**ఆఫీసర్స్ కమిటీ సిఫార్సులను సీఎం రేవంత్ రెడ్డి బుట్టదాఖలు చేశారని విమర్శ**

**స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌కు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణ**




హైదరాబాద్, ఏప్రిల్ 10

హైదరాబాద్ మెట్రోపాలిటన్ డెవలప్‌మెంట్ అథారిటీ పరిధిలో జరుగుతున్న పనుల కేటాయింపులపై ఎమ్మెల్సీ, తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం పారదర్శకతను విస్మరించి, భారీ ఎత్తున నామినేషన్ పద్ధతిలో కాంట్రాక్టులను కట్టబెడుతూ అవినీతికి పాల్పడుతోందని ఆమె ఆరోపించారు. నిబంధనలకు విరుద్ధంగా జరుగుతున్న ఈ పనుల కేటాయింపులపై ప్రభుత్వం తక్షణమే సమాధానం చెప్పాలని ఆమె డిమాండ్ చేశారు. ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తూ తమకు కావాల్సిన వారికి పనులు అప్పగించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని ఆమె ఈ సందర్భంగా పేర్కొన్నారు. హెచ్ఎండీఏ పరిధిలో పనుల కేటాయింపునకు సంబంధించి గతంలోనే ఒక ఉన్నత స్థాయి ఆఫీసర్స్ కమిటీ కొన్ని కీలక సిఫార్సులు చేసిందని కవిత గుర్తు చేశారు. పనులను నామినేషన్ పద్ధతిలో కాకుండా కేవలం బహిరంగ టెండర్ల ద్వారానే కట్టబెట్టాలని ఆ కమిటీ స్పష్టంగా నివేదిక ఇచ్చిందని ఆమె తెలిపారు. అయినప్పటికీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆ రిపోర్టును ఏమాత్రం పట్టించుకోకుండా పక్కన పెట్టేశారని ఆమె విమర్శించారు. నిపుణుల కమిటీ సూచనలను బేఖాతరు చేస్తూ ప్రభుత్వం మొండిగా ముందుకు వెళ్లడం వెనుక పెద్ద ఎత్తున క్విడ్ ప్రో కో కుట్ర దాగి ఉందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు అనుమానం వ్యక్తం చేశారు.సుమారు 1,142 కోట్ల రూపాయల విలువైన పనులను నామినేషన్ పద్ధతిలో ఇవ్వడాన్ని తాము తీవ్రంగా ఖండిస్తున్నామని కవిత స్పష్టం చేశారు. ఇది స్టేట్ ఫైనాన్షియల్ కోడ్‌కు పూర్తి వ్యతిరేకమని, ప్రభుత్వ నిబంధనలను కాంగ్రెస్ నేతలు కాలరాస్తున్నారని మండిపడ్డారు. టెండర్ల ప్రక్రియ ద్వారా పనులు కేటాయిస్తే ప్రభుత్వానికి ఆదాయం రావడమే కాకుండా, పనుల్లో నాణ్యత కూడా ఉంటుందని ఆమె వివరించారు. కానీ ప్రస్తుత ప్రభుత్వం కేవలం కమిషన్ల కోసమే నామినేషన్ పద్ధతిని ఎంచుకుందని ఆమె ఆరోపించారు. ఈ వ్యవహారంపై సమగ్ర విచారణ జరపాలని ఆమె ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ఇప్పటికైనా మేల్కొని నామినేషన్ పద్ధతిలో ఇచ్చిన కాంట్రాక్టులను రద్దు చేయాలని కవిత డిమాండ్ చేశారు. ప్రతి పనిని పారదర్శకంగా టెండర్ల ద్వారానే అర్హులైన వారికి అప్పగించాలని ఆమె సూచించారు. లేనిపక్షంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ ప్రభుత్వ అవినీతిని ఎండగడతామని ఆమె హెచ్చరించారు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీసేలా ప్రభుత్వం తీసుకుంటున్న ఇటువంటి నిర్ణయాలపై తాము పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు. హెచ్ఎండీఏ నిధులను అధికార పార్టీ నేతల జేబుల్లోకి మళ్లించే ప్రయత్నాలను అడ్డుకుంటామని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు పునరుద్ఘాటించారు.మొత్తానికి హెచ్ఎండీఏ కాంట్రాక్టుల వ్యవహారం ఇప్పుడు తెలంగాణ రాజకీయాల్లో వేడి పుట్టిస్తోంది. కవిత చేసిన ఆరోపణలపై అధికార పక్షం ఎలా స్పందిస్తుందోనన్న ఉత్కంఠ నెలకొంది. పారదర్శక పాలన అందిస్తామని చెప్పి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్, కేవలం కొద్ది నెలల్లోనే వేల కోట్ల రూపాయల పనులను టెండర్లు లేకుండా ఇవ్వడం చర్చనీయాంశంగా మారింది. ఈ అంశంపై విపక్షాలు ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వాన్ని నిలదీసేందుకు సిద్ధమవుతున్నాయి. రానున్న రోజుల్లో ఈ కాంట్రాక్టుల వ్యవహారం మరిన్ని మలుపులు తిరిగే అవకాశం ఉందని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు

# కేసీఆర్‌తో మాజీ మంత్రి జీవన్ రెడ్డి భేటీ

**ఎర్రవెల్లిలో భావోద్వేగ దృశ్యాలు**

**"నన్ను దేవుడే పంపిండు" అంటూ కేసీఆర్‌తో జీవన్ రెడ్డి భావోద్వేగ వ్యాఖ్యలు**

**ఎర్రవెల్లి నివాసంలో ఘన స్వాగతం పలికిన కేటీఆర్, మాజీ మంత్రులు**

**జగిత్యాల రాజకీయాల్లో సరికొత్త సమీకరణాలకు వేదికైన మర్యాదపూర్వక భేటీ**

హైదరాబాద్, ఏప్రిల్ 10

తెలంగాణ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. మాజీ మంత్రి మరియు సీనియర్ నాయకుడు టి. జీవన్ రెడ్డి శుక్రవారం నాడు బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్ రావుతో ఎర్రవెల్లిలోని ఆయన నివాసంలో మర్యాదపూర్వక భేటీ అయ్యారు. ఈ సందర్భంగా నివాసానికి చేరుకున్న జీవన్ రెడ్డికి బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పుష్పగుచ్ఛం అందించి సాదరంగా ఆహ్వానించారు. ఈ భేటీ రాజకీయ వర్గాల్లో ఆసక్తిని రేకెత్తించడమే కాకుండా, ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాల్లో ముఖ్యంగా జగిత్యాల నియోజకవర్గంలో సరికొత్త సమీకరణాలకు దారితీసే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.కేసీఆర్‌ను కలిసిన సమయంలో జీవన్ రెడ్డి అత్యంత భావోద్వేగానికి లోనయ్యారు. "అన్నా.. నన్ను దేవుడే పంపిండు మీతో కలిసి పని చేయమని" అంటూ ఆయన చేసిన వ్యాఖ్యలు అక్కడ ఉన్న వారందరినీ ఆకట్టుకున్నాయి. గత కొంతకాలంగా సాగుతున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో, ఈ కలయిక ప్రాధాన్యత సంతరించుకుంది. కేసీఆర్ కూడా జీవన్ రెడ్డిని ఆత్మీయంగా పలకరించి, తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలుస్తోంది. పార్టీ బలోపేతం మరియు భవిష్యత్తు కార్యాచరణపై వీరి మధ్య సుదీర్ఘంగా చర్చలు జరిగినట్లు సమాచారం.ఈ భేటీలో బీఆర్ఎస్ పార్టీకి చెందిన పలువురు హేమాహేమీలు పాల్గొన్నారు. మాజీ మంత్రులు కొప్పుల ఈశ్వర్, గంగుల కమలాకర్, ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ ఎల్ రమణ, కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్ తదితరులు జీవన్ రెడ్డికి స్వాగతం పలికారు. అలాగే మాజీ ఎంపీ జోగినపల్లి సంతోష్ కుమార్, మాజీ ఎమ్మెల్యే కె. విద్యాసాగర్ రావుతో పాటు జగిత్యాల మాజీ జడ్పీ చైర్ పర్సన్ దంపతులు వసంత సురేశ్ ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. సీనియర్ నాయకులు గ్యాదరి బాలమల్లు, మారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, రాగిడి లక్ష్మారెడ్డి కూడా కేసీఆర్ నివాసంలో సందడి చేశారు.జగిత్యాల ప్రాంతంలో బలమైన పట్టున్న జీవన్ రెడ్డి వంటి నాయకుడు కేసీఆర్‌తో భేటీ కావడం వెనుక లోతైన రాజకీయ వ్యూహాలు ఉన్నట్లు రాజకీయ వర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇప్పటికే కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై అసంతృప్తితో ఉన్న పలువురు నేతలు బీఆర్ఎస్ వైపు చూస్తున్న తరుణంలో, ఈ పరిణామం అధికార పార్టీకి సవాలుగా మారే అవకాశం ఉంది. ఈ భేటీ తర్వాత జగిత్యాల నియోజకవర్గంలో బీఆర్ఎస్ శ్రేణుల్లో నూతనోత్సాహం కనిపిస్తోంది. పార్టీని సంస్థాగతంగా మరింత బలోపేతం చేసేందుకు ఈ కలయిక దోహదపడుతుందని గులాబీ శ్రేణులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నాయి. మొత్తానికి ఎర్రవెల్లి నివాసం నేడు రాజకీయ చర్చలకు కేంద్ర బిందువుగా మారింది. సీనియర్ నేత జీవన్ రెడ్డి అనుభవం, కేసీఆర్ వ్యూహరచన తోడైతే భవిష్యత్తులో రాజకీయ చిత్రం ఎలా ఉండబోతుందనేది ఆసక్తికరంగా మారింది. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ రాజకీయాలపై ఈ భేటీ ప్రభావం చూపే అవకాశం ఉంది. రానున్న రోజుల్లో మరికొందరు కీలక నేతలు కూడా బీఆర్ఎస్ అధినేతను కలిసే అవకాశం ఉన్నట్లు సమాచారం. ప్రజల పక్షాన నిలబడి పోరాటం చేయడమే తమ లక్ష్యమని భేటీ అనంతరం నేతలు స్పష్టం చేశారు.



# మహిళల సాధికారతకు ఇటుకల పరిశ్రమలు

**- తెలంగాణ ప్రభుత్వ ముందడుగు**

**- స్వయం సహాయక సంఘాలకు ఉపాధి అవకాశాలు**

**- గృహ నిర్మాణానికి స్థానికంగా ఇటుకల సరఫరా**



హైదరాబాద్, ఏప్రిల్ 10

మహిళల ఆర్థిక సాధికారతకు ప్రాధాన్యత ఇస్తూ తెలంగాణ ప్రభుత్వం స్వయం సహాయక సంఘాల ఆధ్వర్యంలో ఇటుకల తయారీ యూనిట్లను ప్రోత్సహిస్తోంది. గ్రామీణ మహిళలకు ఉపాధి అవకాశాలు కల్పించడంతో పాటు ప్రభుత్వ గృహ నిర్మాణ పథకాల కోసం అవసరమైన ఇటుకలను స్థానికంగా అందుబాటులోకి తీసుకురావడం ఈ కార్యక్రమం ముఖ్య లక్ష్యంగా కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా 736 మహిళా సంఘాల యూనిట్లు గుర్తించబడి ఈ రంగంలో కార్యకలాపాలు సాగిస్తున్నాయి.ప్రస్తుతం ఈ యూనిట్లు రోజుకు 300 నుండి 1000 ఇటుకలు మాత్రమే ఉత్పత్తి చేస్తున్నప్పటికీ, పూర్తి సామర్థ్యంతో పనిచేస్తే రోజుకు 2000 నుండి 2500 ఇటుకలు తయారు చేసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఒక్కో యూనిట్ పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందేందుకు సుమారు 18 లక్షల రూపాయల పెట్టుబడి అవసరమని అంచనా వేశారు. ఈ దిశగా ప్రభుత్వం చర్యలు చేపట్టింది. ఈ యూనిట్లకు ఆర్థిక సహాయం అందించేందుకు ప్రధానమంత్రి ఉపాధి సృష్టి పథకం కింద రుణాలు మంజూరు చేస్తూ 35 శాతం సబ్సిడీ కల్పిస్తున్నారు. బ్యాంకులు, స్త్రీ నిధి ద్వారా కూడా రుణ సదుపాయాలు కల్పిస్తున్నారు. యూనిట్ నిర్వహణలో నైపుణ్యాన్ని పెంపొందించేందుకు 15 రోజుల శిక్షణ కార్యక్రమాలను అమలు చేస్తున్నారు. ప్రభుత్వ సహకారంతో కొన్ని యూనిట్లు ఇప్పటికే పూర్తి సామర్థ్యంతో పనిచేస్తున్నాయి.ఇటుకల యూనిట్లకు స్థిరమైన మార్కెట్ కల్పించేందుకు గృహ నిర్మాణ శాఖతో సమన్వయం చేసుకుని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి అవసరమైన ఇటుకలను ఈ యూనిట్ల నుంచే కొనుగోలు చేయాలని నిర్ణయించారు. దీని ద్వారా మహిళా సంఘాలకు నిరంతర ఆదాయం లభిస్తూ గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం అవుతోంది.ఈ కార్యక్రమంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పాల్గొని మహిళా సంఘాల సభ్యులను ప్రోత్సహించారు. మహిళలు ఆర్థికంగా బలపడటానికి ఇటువంటి ఉపాధి అవకాశాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ప్రభుత్వం మహిళా సాధికారతకు కట్టుబడి ఉందని, ప్రతి యూనిట్ విజయవంతం కావడానికి అవసరమైన మద్దతు అందిస్తామని తెలిపారు. మిర్జాపూర్ గ్రామానికి చెందిన కుంట మల్ల వాణి ఈ కార్యక్రమం ద్వారా విజయగాథగా నిలిచారు. శిక్షణ పొందిన తర్వాత ఇటుకల యూనిట్ స్థాపించి ప్రస్తుతం పూర్తి స్థాయిలో నిర్వహిస్తూ నెలకు గణనీయమైన ఆదాయం పొందుతున్నారు. ఆమె యూనిట్ ద్వారా పలువురికి ఉపాధి కల్పిస్తూ కుటుంబాన్ని ఆర్థికంగా బలోపేతం చేసుకున్నారు. ఈ విధంగా మహిళా సంఘాల ద్వారా గ్రామీణాభివృద్ధి సాధ్యమవుతుందని అధికారులు పేర్కొన్నారు.



# మూసీ సుందరీకరణపై గోరేటి వెంకన్న గళం

**పేదల ఇళ్లు కూల్చకుండా అభివృద్ధి చేయాలని డిమాండ్**


**ఒక్క ఇల్లు కూల్చకుండా మూసీ అభివృద్ధి సాధ్యం కాదా?**

**పేదల ఇళ్లు కూల్చడం ప్రజాస్వామ్యం అనిపించుకోదు**

**స్వప్రయోజనాల కోసమే మూసీ ప్రాజెక్ట్: రేవంత్ రెడ్డిపై విమర్శలు**

హైదరాబాద్, ఏప్రిల్ 10

మూసీ నది సుందరీకరణ ప్రాజెక్టుపై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ, ప్రముఖ ప్రజా గాయకుడు గోరేటి వెంకన్న తనదైన శైలిలో రాష్ట్ర ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. మూసీ నదిని సుందరీకరించాలని తాము కూడా కోరుకుంటున్నామని, అయితే ఒక్క పేదవాని ఇల్లు కూడా కూల్చకుండా ఈ ప్రక్రియ జరగాలని ఆయన డిమాండ్ చేశారు. అభివృద్ధి పేరుతో పేదల గూడు చెడగొట్టడం సమంజసం కాదని, మానవీయ కోణంలో ఆలోచించి ప్రాజెక్టును ముందుకు తీసుకెళ్లాలని ప్రభుత్వానికి సూచించారు. ప్రజాస్వామ్యం గురించి గొప్పగా మాట్లాడే కాంగ్రెస్ పార్టీ, పేదల ఇళ్లు కూల్చడాన్ని ప్రజాస్వామ్యం ఎలా అంటుందని ఆయన ప్రశ్నించారు. ప్రస్తుతం సాగుతున్న మూసీ ప్రాజెక్టు వెనుక అనేక స్వప్రయోజనాలు దాగి ఉన్నాయని గోరేటి వెంకన్న ఆరోపించారు. సాంఘిక, ఆర్థిక, నైతిక మరియు ప్రాంతీయ అభివృద్ధి అని చెబుతున్నప్పటికీ, దీని వెనుక కేవలం కొందరి ప్రయోజనాల కోసమే ఈ హడావుడి చేస్తున్నట్లు కనిపిస్తోందని విమర్శించారు. నదిని ప్రక్షాళన చేయాలంటే ముందుగా చేయాల్సింది ఇళ్ల కూల్చివేతలు కాదని, పరిశ్రమల నుండి వచ్చే రసాయన వ్యర్థాలు నదిలో కలవకుండా కట్టడి చేయడమని ఆయన స్పష్టం చేశారు. మూల కారణమైన కంపెనీ వ్యర్థాలను వదిలేసి, పేదల నివాసాలపై పడటం ఏ రకమైన న్యాయమని నిలదీశారు.రాజకీయ సమీకరణాలను ప్రస్తావిస్తూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి వెంకన్న కీలక సూచన చేశారు. ప్రస్తుతం ప్రభుత్వానికి కమ్యూనిస్టు పార్టీలతో పొత్తు ఉందని, ఈ నేపథ్యంలో సీపీఐ రాష్ట్ర కార్యదర్శి సాంబశివరావు వంటి నాయకులను పిలిచి మూసీ సమస్యపై చర్చించాలని కోరారు. ప్రజా సమస్యలపై అవగాహన ఉన్న వారితో చర్చించి, ఎవరికీ నష్టం కలగకుండా ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాలని సూచించారు. కమ్యూనిస్టుల సలహాలు తీసుకుంటే పేదలకు న్యాయం జరిగే అవకాశం ఉంటుందని ఆయన అభిప్రాయపడ్డారు.ప్రభుత్వ ద్వంద్వ నీతిని ఎండగడుతూ, ఇదే పరిస్థితిలో కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటే ఊరుకునేదా అని వెంకన్న ప్రశ్నించారు. "ఈరోజు అధికారంలో ఉండి ఇన్ని చేస్తున్నారు కదా, అదే మీరు ప్రతిపక్షంలో ఉండి ఉంటే ఈ ఇళ్ల కూల్చివేతలపై పెద్ద ఎత్తున ఉద్యమాలు చేసేవారు కదా" అని ఎద్దేవా చేశారు. అధికారంలోకి రాగానే ప్రతిపక్షంలో ఉన్నప్పటి మాటలను మర్చిపోవడం సరికాదన్నారు. మూసీ పునరుజ్జీవం పేరుతో వేల కోట్ల రూపాయల ప్రాజెక్టులు చేపడుతూ, పేదలను రోడ్డున పడేయడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు.



మూసీ నది ప్రక్షాళన అనేది నగర ప్రజలందరి అవసరమని, కానీ అది పేదల కన్నీళ్లపై జరగకూడదని వెంకన్న హెచ్చరించారు. నది పరివాహక ప్రాంతంలోని పేద ప్రజల సామాజిక మరియు ఆర్థిక స్థితిగతులను పరిగణనలోకి తీసుకోవాలని కోరారు. కేవలం సుందరీకరణ కోసం కాకుండా, నది సహజత్వాన్ని కాపాడుతూ పర్యావరణ పరిరక్షణకు ప్రాధాన్యత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ నిర్ణయాల వల్ల బడుగు బలహీన వర్గాలకు అన్యాయం జరిగితే బీఆర్ఎస్ పక్షాన పోరాటం తప్పదని ఆయన స్పష్టం చేశారు.


# మతం మార్పిడి ముఠా ఘాతుకం


**పంజాగుట్టలో అన్నదమ్ముల అరచకాలు**

**ఐదుగురు హిందూ యువతులపై ప్రేమ పేరుతో వల.. మతం మారాలంటూ వేధింపులు**

**నిందితుడు జమీర్‌పై గతంలోనే పోక్సో కేసు.. జైలుకు వెళ్లొచ్చినా మారని వైనం**

**బాధితురాలి ధైర్యంతో వెలుగులోకి వచ్చిన వంచన ఉదంతం.. దర్యాప్తులో పోలీసులు**




**హైదరాబాద్, ఏప్రిల్ 10**

నగర నడిబొడ్డున ఉన్న పంజాగుట్ట పోలీస్ స్టేషన్ పరి ధిలో హిందూ యువ తులను లక్ష్యంగా చేసుకుని సాగుతున్న ఒక భయంకరమైన వంచన ఉదంతం వెలుగులోకి వచ్చింది. ప్రేమ పేరుతో అమాయక యువతులకు వల వేయడం, ఆపై వారిని లొంగదీసుకుని మతం మార్చుకోవాలంటూ చిత్రహింసలకు గురిచేస్తున్న ఇద్దరు అన్నదమ్ముల ఉదంతం నగరంలో తీవ్ర కలకలం రేపుతోంది. జమీర్ మరియు అతని తమ్ముడు మిరాజ్ కలిసి ఒక పక్కా ప్రణాళికతో ఈ అరాచకానికి పాల్పడుతున్నట్లు పోలీసుల విచారణలో తేలింది. ఇప్పటివరకు సుమారు ఐదుగురు యువతులను వీరు ఇదే తరహాలో మోసం చేసినట్లు ప్రాథమిక సమాచారం అందుతోంది.నిందితుల్లో ఒకరైన జమీర్ ఒక క్రమ నేరస్థుడని పోలీసుల రికార్డులు చెబుతున్నాయి. గతంలోనే ఇతనిపై ఒక మైనర్ బాలికను వేధించిన కేసులో పంజాగుట్ట పోలీసులు పోక్సో (గూజూూ) చట్టం కింద కేసు నమోదు చేశారు. ఆ కేసులో జైలు శిక్ష అనుభవించి బయటకు వచ్చిన జమీర్, తన ప్రవర్తన మార్చుకోకుండా తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఈ మతం మార్పిడి ముఠాను నడుపుతున్నట్లు తెలుస్తోంది. యువతులను ట్రాప్ చేయడం, వారిని శారీరకంగా లొంగదీసుకోవడం, ఆపై తమ మతంలోకి మారకపోతే చంపేస్తామని బెదిరించడం వీరి శైలిగా మారింది. తాజాగా ఓ యువతి ఫిర్యాదుతో వీరి అసలు స్వరూపం బయటపడింది. బాధిత యువతి వెల్లడించిన వివరాల ప్రకారం.. జమీర్ తొలుత ప్రేమ పేరుతో ఆమెకు దగ్గరయ్యాడు. ఆ తర్వాత ఆమెపై అఘాయిత్యానికి పాల్పడటమే కాకుండా, తన మతంలోకి మారాలని బలవంతం చేశాడు. ఇందుకు నిరాకరించడంతో తన తమ్ముడు మిరాజ్‌తో కలిసి ఆమెను గదిలో బంధించి చిత్రహింసలకు గురిచేశాడు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తామని అన్నదమ్ములిద్దరూ కలిసి ఆమెను తీవ్రంగా బ్లాక్ మెయిల్ చేశారు. ప్రాణ భయం ఉన్నప్పటికీ, బాధితురాలు ధైర్యంగా పంజాగుట్ట పోలీసులను ఆశ్రయించడంతో ఈ కిరాతకుల గుట్టు రట్టయింది.ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు లోతైన దర్యాప్తు చేపట్టారు. ఈ అన్నదమ్ముల వెనుక ఏదైనా పెద్ద నెట్‌వర్క్ ఉందా? వీరికి ఎవరైనా ఆర్థికంగా సహకరిస్తున్నారా? అనే కోణంలో ఆరా తీస్తున్నారు. వీరి ఫోన్ డేటా మరియు ఇతర సోషల్ మీడియా ఖాతాలను విశ్లేషిస్తున్నారు. బాధితుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉండటంతో, అన్యాయానికి గురైన వారు ధైర్యంగా ముందుకు రావాలని పోలీసులు కోరుతున్నారు. నగరంలో ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా కఠిన చర్యలు తీసుకుంటామని ఉన్నతాధికారులు వెల్లడించారు.మరోవైపు నగర నడిబొడ్డున మతం మార్పిడి లక్ష్యంగా జరుగుతున్న ఈ అరాచకాలు స్థానికుల్లో భయాందోళనలు కలిగిస్తున్నాయి. నిందితులపై కఠినమైన సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి, వారికి ఉరిశిక్ష పడేలా చూడాలని పలు హిందూ సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. బాధితురాలికి మరియు ఆమె కుటుంబానికి రక్షణ కల్పించిన పోలీసులు, నిందితులను కస్టడీలోకి తీసుకుని విచారిస్తున్నారు. ఈ కేసు హైదరాబాద్‌లో ఇప్పుడు హాట్ టాపిక్‌గా మారింది. ప్రభుత్వం ఇటువంటి ముఠాలపై ఉక్కుపాదం మోపాలని ప్రజలు కోరుకుంటున్నారు.

# టీజీఎస్ఆర్టీసీ ఉద్యోగులకు శుభవార్త

**2.1 శాతం డీఏ పెంపునకు ప్రభుత్వం గ్రీన్ సిగ్నల్**

**50.7 శాతం నుండి 52.8 శాతానికి చేరిన కరువు భత్యం**

**జనవరి 2026 నుండి పెంపు అమలు.. - సప్లిమెంటరీ బిల్లుల ద్వారా బకాయిల చెల్లింపు**

**ఉద్యోగుల సంక్షేమం సంస్థ బలోపేతమే లక్ష్యమన్న మంత్రి పొన్నం ప్రభాకర్**



**హైదరాబాద్, ఏప్రిల్ 10**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ ఆర్టీసీ) ఉద్యోగులకు రాష్ట్ర ప్రభుత్వం ఉగాది కానుకగా తీపి కబురు అందించింది. ఉద్యోగులకు చెల్లించాల్సిన కరువు భత్యాన్ని (డీఏ) 2.1 శాతం పెంచుతూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు రవాణా శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారిక ప్రకటన విడుదల చేశారు. తాజా పెంపుతో గతంలో ఉన్న 50.7 శాతం డీఏ ఇప్పుడు 52.8 శాతానికి చేరింది. ఈ నిర్ణయం వల్ల రాష్ట్రవ్యాప్తంగా ఉన్న వేలాది మంది ఆర్టీసీ కార్మికులు మరియు ఉద్యోగులకు ఆర్థికంగా లబ్ధి చేకూరనుంది. ప్రజా పాలన ప్రభుత్వంలో ఉద్యోగుల సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నామని ఈ సందర్భంగా మంత్రి పునరుద్ఘాటించారు.పెరిగిన ఈ డీఏ 2026 జనవరి 1వ తేదీ నుండి అమలులోకి రానుంది. గత మూడు నెలలకు (జనవరి, ఫిబ్రవరి, మార్చి) సంబంధించిన బకాయిలను సప్లిమెంటరీ బిల్లుల ద్వారా మూడు విడతల్లో ప్రభుత్వం చెల్లించనుంది. ఈ డీఏ పెంపు వల్ల ఆర్టీసీపై ప్రతి నెలా సుమారు 2.82 కోట్ల రూపాయల అదనపు భారం పడనుంది. అయినప్పటికీ, కార్మికుల కష్టాన్ని గుర్తించి ప్రభుత్వం ఈ భారాన్ని భరించేందుకు సిద్ధమైంది. గతంలో జూలై 2025లో కూడా ప్రభుత్వం 2.1 శాతం డీఏను పెంచి 50.7 శాతానికి చేర్చింది. తాజా పెంపుతో ఉద్యోగులకు సంబంధించిన అన్ని డీఏ బకాయిలను ప్రభుత్వం క్లియర్ చేసినట్లయింది.ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ వివిధ రీజియన్ల రీజినల్ మేనేజర్లతో (ఆర్.ఎం) సమావేశమై సంస్థలో పెండింగ్‌లో ఉన్న పనులు మరియు అభివృద్ధి కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఆర్టీసీలో కొనసాగుతున్న అభివృద్ధి పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. 2024 మే నెలలో ఆర్పీఎస్-2017 అమలు చేసినప్పటి నుండి ఉద్యోగుల ప్రయోజనాల విషయంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరిస్తోందని ఆయన గుర్తు చేశారు. ఉద్యోగులకు చెల్లించాల్సిన ఏకైక పెండింగ్ డీఏను కూడా ఇప్పుడు విడుదల చేయడం ద్వారా కార్మిక వర్గాల్లో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. తెలంగాణ ప్రజా పాలన ప్రభుత్వం ఏర్పడినప్పటి నుండి ఆర్టీసీ సంస్థ పరిరక్షణ, ఉద్యోగుల సంక్షేమం మరియు ప్రయాణికుల సౌకర్యమే కేంద్రంగా పనిచేస్తోందని మంత్రి పేర్కొన్నారు. కార్మికుల ఆరోగ్య సంరక్షణ కోసం తార్నాక ఆసుపత్రిని అప్‌గ్రేడ్ చేయడం, కారుణ్య నియామకాలు చేపట్టడం మరియు సుదీర్ఘ కాలంగా విధులకు దూరమైన వారిని త్రిమెన్ కమిటీ ద్వారా తిరిగి ఉద్యోగాల్లోకి తీసుకోవడం వంటి కీలక నిర్ణయాలు తీసుకున్నట్లు వివరించారు. అలాగే కొత్త బస్సుల కొనుగోలు మరియు కొత్త నియామకాల ద్వారా సిబ్బందిపై పని భారాన్ని తగ్గించేందుకు కృషి చేస్తున్నామని తెలిపారు.తెలంగాణ రాష్ట్రానికి జీవనాడి (లైఫ్ లైన్) వంటి ఆర్టీసీని మరింతగా ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు ఉద్యోగులు అంకితభావంతో పనిచేయాలని మంత్రి పిలుపునిచ్చారు. మహాలక్ష్మి పథకం ద్వారా మహిళలకు ఉచిత ప్రయాణం కల్పిస్తున్న నేపథ్యంలో, సంస్థను లాభాల బాటలో నడిపించేందుకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి తమ ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని, సంస్థను బలోపేతం చేయడంలో కార్మికుల పాత్ర కీలకమని ఆయన కొనియాడారు. డీఏ పెంపు సందర్భంగా ఆర్టీసీ ఉద్యోగులందరికీ మంత్రి తన శుభాకాంక్షలు తెలియజేశారు.



# జస్టిస్ యశ్వంత్ వర్మ అకస్మాత్తుగా రాజీనామా

**అవినీతి ఆరోపణల నేపథ్యంలో సంచలన నిర్ణయం**

**అభిశంసన ప్రక్రియ జరుగుతుండగానే పదవి నుంచి తప్పుకున్న జడ్జి**

**రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు రాజీనామా లేఖ పంపిన యశ్వంత్ వర్మ**

**రాజీనామాతో నిలిచిపోనున్న పార్లమెంటరీ చర్యలు..**

**యధావిధిగా అందనున్న రిటైర్మెంట్ బెనిఫిట్స్**



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 10**

దేశ అత్యున్నత న్యాయ వ్యవస్థలో సంచలనం రేకెత్తిస్తూ అలహాబాద్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యశ్వంత్ వర్మ తన పదవికి రాజీనామా చేశారు. అవినీతి ఆరోపణల కేసులో ఆయనపై అభిశంసన ప్రక్రియ ప్రారంభమై, జడ్జి హోదా నుంచి తప్పుకోవాల్సిన పరిస్థితులు నెలకొన్న తరుణంలో ఆయన ఈ నిర్ణయం తీసుకోవడం ప్రాధాన్యత సంతరించుకుంది. జస్టిస్ వర్మ తన రాజీనామా లేఖను నేరుగా రాష్ట్రపతి ద్రౌపది ముర్ముకు పంపారు. ఏప్రిల్ 9వ తేదీన రాసిన ఈ లేఖలో తాను తక్షణమే అలహాబాద్ కోర్టు విధులను వీడుతున్నట్లు పేర్కొన్నారు. అయితే, తన రాజీనామాకు గల ఖచ్చితమైన కారణాలను మాత్రం ఆయన లేఖలో ఎక్కడా ప్రస్తావించకపోవడం గమనార్హం.ఈ వివాదం గతేడాది ఢిల్లీలోని జస్టిస్ వర్మ నివాసంలో జరిగిన సోదాలతో ప్రారంభమైంది. 2025 మార్చి 14వ తేదీన ఢిల్లీ హైకోర్టు జడ్జిగా ఉన్న సమయంలో, ఆయన అధికారిక క్వార్టర్స్‌లో భారీ ఎత్తున నగదు పట్టుబడింది. క్వార్టర్స్‌లోని స్టోర్‌రూమ్‌లో సగం కాలిన నోట్ల కట్టలను అధికారులు స్వాధీనం చేసుకోవడం అప్పట్లో దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. సోదాలు జరిగిన సమయంలో జస్టిస్ వర్మ దంపతులు భూపాల్‌లో ఉన్నప్పటికీ, ఆ నగదుతో తమకు ఎటువంటి సంబంధం లేదని ఆయన పలుమార్లు వివరణ ఇచ్చారు. అయినప్పటికీ, ఈ అవినీతి ఆరోపణల తీవ్రత దృష్ట్యా ఆయనపై అభిశంసన ప్రక్రియను ప్రారంభించారు జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామా చేయడంతో ఆయనపై పార్లమెంట్ చేపట్టాల్సిన అభిశంసన ప్రక్రియ ఇప్పుడు నిలిచిపోనుంది. లోక్‌సభ సెక్రటేరియట్ వర్గాల సమాచారం ప్రకారం, నిందితుడు పదవిలో లేనప్పుడు అభిశంసన ప్రక్రియను కొనసాగించడం వీలుపడదు. దీనివల్ల జస్టిస్ వర్మకు ఒక రకంగా ఉపశమనం లభించినట్లయింది. ఒకవేళ పార్లమెంట్ ద్వారా ఆయనపై అభిశంసన నెగ్గి, పదవి నుంచి తొలగించి ఉంటే ఆయనకు రావాల్సిన పెన్షన్ మరియు ఇతర రిటైర్మెంట్ ప్రయోజనాలు నిలిచిపోయేవి. కానీ ఇప్పుడు రాజీనామా చేయడం వల్ల ఆయనకు యధావిధిగా అన్ని రకాల బెనిఫిట్స్ అందనున్నాయి న్యాయమూర్తులపై అవినీతి ఆరోపణలు రావడం మరియు ఆ ప్రక్రియ ముగియక ముందే వారు రాజీనామా చేయడంపై న్యాయ కోవిదుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. జస్టిస్ వర్మ ఇంట్లో దొరికిన నగదు మూలాలు ఎక్కడివి? ఆ సగం కాలిన నోట్ల వెనుక ఉన్న అసలు రహస్యమేమిటి? అనే ప్రశ్నలకు ఇప్పుడు సమాధానం దొరకకుండా పోయే అవకాశం ఉందని కొందరు అభిప్రాయపడుతున్నారు. వ్యవస్థలోని లొసుగులను ఉపయోగించుకుని విచారణ నుంచి తప్పించుకునే ప్రయత్నంగా కూడా దీన్ని చూస్తున్నారు. గతంలోనూ కొందరు న్యాయమూర్తులు ఇటువంటి పరిస్థితుల్లోనే రాజీనామా చేసి తమ ప్రయోజనాలను కాపాడుకున్న దాఖలాలు ఉన్నాయి. మొత్తానికి జస్టిస్ యశ్వంత్ వర్మ రాజీనామాతో ఈ వివాదాస్పద ఎపిసోడ్‌కు ఒక ముగింపు పడినట్లయింది. అయితే, దేశంలోని న్యాయమూర్తుల నియామకాలు మరియు వారి జవాబుదారీతనంపై ఈ ఘటన మరోసారి చర్చకు దారితీసింది. అత్యున్నత పదవుల్లో ఉన్నవారు ఆరోపణలు ఎదుర్కొన్నప్పుడు విచారణను ఎదుర్కోవాల్సింది పోయి, ఇలా పదవులను వీడి ప్రయోజనాలను కాపాడుకోవడం ఎంతవరకు సబబని మేధావులు ప్రశ్నిస్తున్నారు. అలహాబాద్ హైకోర్టు నుంచి తప్పుకున్న జస్టిస్ వర్మ భవిష్యత్తులో ఈ కేసుల నుంచి ఎలా బయటపడతారో చూడాలి. ఈ రాజీనామా లేఖను రాష్ట్రపతి కార్యాలయం పరిశీలనలోకి తీసుకుని తదుపరి చర్యలు చేపట్టింది.

# మూడేళ్ల వయసులోనే చెస్‌లో రెండు ప్రపంచ రికార్డులు

**- చిన్నారి ఘనతకు గాంధీ భవన్‌లో సన్మానం - మంత్రి కొండా సురేఖ మనవడికి అభినందనలు**

**- వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ సర్టిఫికెట్లు అందజేత - నాయకుల సమక్షంలో ఘన సన్మానం**



**హైదరాబాద్, ఏప్రిల్ 10**

మూడేళ్ల చిన్న వయసులోనే చెస్‌లో రెండు ప్రపంచ రికార్డులు సృష్టించిన చిన్నారి కొండా శ్రైశు మురళీకృష్ణ పటేల్ ఘనత సాధించాడు. రాష్ట్ర మంత్రి కొండా సురేఖ మనవడైన ఈ బాల ప్రతిభకు గాంధీ భవన్‌లో ప్రత్యేక సన్మానం నిర్వహించారు. ఈ విజయంతో కుటుంబ సభ్యులతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఆనందం వ్యక్తమవుతోంది.ఈ సందర్భంగా వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డ్స్ (లండన్) నుంచి అందిన సర్టిఫికెట్లను చిన్నారికి అందజేశారు. చిన్న వయసులోనే అసాధారణ ప్రతిభ కనబర్చినందుకు నాయకులు, ప్రముఖులు అతడిని అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీసీసీ అధ్యక్షుడు మహేశ్ గౌడ్, ప్రభుత్వ విప్ ఇలయ్య, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల శామ్యూల్ తదితరులు పాల్గొని చిన్నారికి శుభాకాంక్షలు తెలిపారు. చిన్నారి సాధించిన విజయాన్ని గర్వంగా భావిస్తున్నామని పేర్కొన్నారు.ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ చిన్న వయసులోనే ఇంతటి ప్రతిభ కనబర్చడం అరుదైన విషయమని అన్నారు. తల్లిదండ్రులు, గురువుల ప్రోత్సాహంతోనే ఇలాంటి విజయాలు సాధ్యమవుతాయని అభిప్రాయపడ్డారు.చిన్నారి భవిష్యత్తులో దేశానికి గర్వకారణంగా నిలవాలని, అంతర్జాతీయ స్థాయిలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. ఇలాంటి ప్రతిభావంతులను ప్రోత్సహించడం సమాజ బాధ్యత అని తెలిపారు. మొత్తంగా ఈ సన్మానం కార్యక్రమం చిన్నారిలో మరింత ఉత్సాహాన్ని నింపగా, రాష్ట్రంలో ఉన్న యువ ప్రతిభకు ప్రేరణగా నిలిచింది.

